క్లుప్తంగా

కోర్టు నిర్ణయంతో బీసీల్లో నిరాశ

తుక్కుగూడ: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సందర్భంగా న్యాయస్థానం జీవో నంబర్ 9పై స్టే విధించడంతో బీసీ వర్గాల ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బంటు ధనంజయ్ అన్నారు. గురువారం పుర కేంద్రంలో ఆయన మాట్లాడారు. న్యాయ స్థాన నిర్ణయం చాలా బాధ కలిగించిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కొంతమంది అగ్రవర్ణాల వారు కుట్రలు చేసి న్యాయ స్థానాలను ఆశ్రయించడాన్ని ఆయన తప్పుబట్టారు.

అసిస్టెంట్ కమిషనర్‌కు సన్మానం



అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

బడంగ్‌పేట్: హైదరాబాద్‌లో దసరా ఉత్సవాల్లో భాగంగా విశ్వకర్మ స్వర్ణకారుల ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ క్రైమ్ బ్రాంచ్ అసిస్టెంట్ కమిషనర్ కేఎం కిరణ్ కుమార్ హాజరుకాగా విశ్వకర్మ స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవచారి, కార్యదర్శి ఈశ్వరోజు బాలేష్‌చారి కలిసి ఆయన్ని ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు.

కందుకూరులో ఆరు నామినేషన్లు

కందుకూరు: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో మొదటి రోజు గురువారం మొత్తం 6 నామినేషన్లు స్వీకరించినట్లు ఎంపీడీఓ సరిత తెలిపారు. అందులో ఎంపీటీసీ స్థానాల కోసం ఐదు కాంగ్రెస్ పార్టీ నుంచి రాగా, ఒకటి స్వతంత్ర అభ్యర్థి నుంచి నామినేషన్ దాఖలైంది. గూడూరు స్థానం నుంచి చిలుకల పూర్ణిమ(కాంగ్రెస్), పులిమామిడి స్థానం నుంచి బుక్క పాండురంగారెడ్డి(కాంగ్రెస్), నేదునూరు స్థానం నుంచి అఫ్జల్‌బేగ్(కాంగ్రెస్), జైత్వారం స్థానం నుంచి బైరు లావణ్య(కాంగ్రెస్), కత్తుల కలమ్మ(ఇండిపెండెంట్), చిప్పలపల్లి స్థానం నుంచి పొట్ట కుమార్(కాంగ్రెస్) నామినేషన్లు వేసినట్లు ఎంపీడీఓ వివరించారు.

సున్నం చెరువులో పూజలు



సున్నం చెరువులో పూజలు చేస్తున్న ప్రతినిధులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడ సున్నం చెరువు పూర్తిగా నిండటంతో గురువారం మత్స్యకార సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కట్ట మైసమ్మకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం సొసైటీ అధ్యక్షుడు తాళ్ల నర్సింహాముదిరాజ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్టల యాదయ్యముదిరాజ్, డైరెక్టర్లు తాళ్ల బాలేశ్‌ముదిరాజ్, చీమల శేఖర్, మెరుగు కృష్ణ, మెరుగు సత్తయ్య, శ్రీశైలం, పిట్టల శేఖర్, తాళ్ల మల్లేశ్, కిరణ్, శ్రీకాంత్, అంజన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరించండి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రగతిని కాంక్షించి ప్రజలంతా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం, అభ్యర్థుల ఎంపిక తదితర విషయాలపై చర్చించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఆశించిన రీతిలో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. రిజర్వేషన్ల మూలంగా పోటీకి అవకాశం రాని నాయకులు, కార్యకర్తలకు పార్టీ తగువిధంగా గుర్తింపునిస్తుందని ధైర్యం చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోతీలాల్, శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలగానే 'ఇంటిగ్రేటెడ్'!



దావుత్‌ఖాన్‌గూడలో అసంపూర్తిగా ఆగిపోయిన మార్కెట్ పనులు

- ముళ్ల పొదల్లో చిక్కుకున్న నిర్మాణం
- రెండున్నరేళ్లుగా కదలని పనులు
- పూర్తి చేయాలంటున్న స్థానికులు

బడంగ్‌పేట్: ప్రజల సౌకర్యార్థం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. దీన్ని పట్టించుకునే వారే లేకపోవడంతో పిల్లర్ల దశలో ఆగిపోయిన నిర్మాణంలో ముళ్ల పొదలు పెరిగాయి. దావుత్‌ఖాన్‌గూడలో సర్వేనంబర్- 2లో ఉన్న రెండెకరాల ప్రభుత్వ స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. ఇందుకోసం రూ.4 కోట్లు వెచ్చించారు. ఈ క్రమంలో పిల్లర్లు పూర్తి చేసి, కొంత మేర స్లాబు వేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడం, ఎలక్షన్లు పూర్తవడం, ప్రభుత్వాలు మారిపోవడం చకచకా జరిగిపోయాయి. దీంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రాజకీయ గ్రహణం పట్టుకుంది. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొత్త సర్కారు కొలువుదీరి రెండేళ్లు దాటినా నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంపై మండిపడుతున్నారు.

అన్నీ ఒకే చోట దొరికేలా..

కూరగాయలు, మాంసం, ఆకుకూరలు, పప్పు దినుసులు వగైరా అన్ని వస్తువులు ఒకేచోట దొరికేలా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టారు. కానీ పాలకుల నిర్లక్ష్యంతో ప్రజల ఆకాంక్ష నెరవేరడం లేదు. రాజకీయ పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం తప్ప నిర్మాణ పనులను పూర్తి చేయాలనే ఆలోచన ఎవరికీ లేకుండాపోయింది. పాలకులకే పట్టింపు లేదు తామెందుకు జోక్యం చేసుకోవాలని భావిస్తున్నారో.. ఏమో..? అధికారులు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించడం లేదు. ఇప్పటికైనా మార్కెట్ భవనాన్ని పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వివరాలు తెలుసుకుంటా



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆగిపోయిందని తెలుసు. ఇంజనీర్లను అడిగి కారణం తెలుసుకుంటా. అందరి సహకారంతో మార్కెట్‌ను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటా. వినియోగదారులు, విక్రయదారులకు సౌకర్యం కల్పించేలా కృషిచేస్తా.

– పి.సరస్వతి, మున్సిపల్ కమిషనర్

హామీల అమలులో విఫలం



బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరితమైన హామీలను ఇచ్చి గద్దెనెక్కిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్పా ఏ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. రైతు భరోసా, రుణమాఫీ, బతుకమ్మ చీరలు, పెన్షన్ల పెంపు, విద్యార్థులకు స్కూటీల పంపిణీ వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా పల్లెలు, పట్టణాల్లో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం బాకీ పడిందని, రాబోవు రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, నట్‌రాజన్, పిల్లి శారద, శేఖర్, యుగేందర్, వెంకట్‌రాంరెడ్డి, జూపల్లి శంకర్, కౌసల్య, చిన్న, యాదగిరి, దేవేందర్‌యాదవ్, కోస్గి శ్రీను, రవియాదవ్, గోపాల్, శ్రీను, భిక్షపతి, బిలాల్, రాంచందర్, గుండు అశోక్, సాదక్, మహమూద్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే ప్రగతి

యాచారం: మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ప్రగతి సాధ్యమని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ వినీతాదేవి పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా గురువారం యాచారం రైతు వేదికలో చిన్నారులకు అన్నప్రాసన, మహిళలకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. అందు కోసం మహిళలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో యాచారం ప్రభుత్వ వైద్యాధికారి ప్రియాంక, ఐకేపీ ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి

సీఐ నర్సయ్య

కొత్తూరు: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు, యువజన సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని పట్టణ సీఐ నర్సయ్య కోరారు. ఇందులో భాగంగా ఆయన గురువారం స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ సాధారణమనే విషయాన్ని ప్రజలు, నాయకులు గుర్తించుకోవాలని కోరారు. ఎన్నికల నిర్వహణ తర్వాత అందరూ ఒకే గ్రామంలో ఉంటారని, కేవలం ఎన్నికల దృష్ట్యా గొడవలు, ఇతర ఘటనలకు పాల్పడితే అనవసరంగా కేసులతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రజలు, యువజన సంఘాల నాయకులు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకారం అందించాలని కోరారు. అంతేకాకుండా ఎక్కడైన అసాంఘిక కార్యకలాపాలు తమ దృష్టికి వస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ నర్సయ్య

రిజర్వేషన్లు అడ్డుకుంటుంది విపక్షాలే



మాట్లాడుతున్న నాయకులు

టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్

మొయినాబాద్‌రూరల్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి, వారికి న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే, విపక్షాలు అడ్డుకుంటున్నాయని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్రానికి పంపితే, బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చించకుండా, బిల్లు పాస్ చేయకుండా, 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. రెండుసార్లు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన బిల్లు రాష్ట్రపతి, గవర్నర్‌ల దగ్గర పెండింగ్‌లో పెట్టడానికి బీజేపీ నాయకులే కారణమని ఆరోపించారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేస్తే, తదనంతరం బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక, బీసీల రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి, 11 శాతం కోత విధించి, బీసీలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు న్యాయం చేయాలని చూస్తుంటే, కొందరు బీసీ వ్యతిరేకులు కోర్టుకు వెళ్లి బీసీ రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా, పిటిషన్‌లు వేసి నోటికాడి ముద్దను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీల పక్షాన నిలవకపోతే, బీజేపీ బీసీల వ్యతిరేక పార్టీగా మిగిలిపోతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, సర్ధార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణాగౌడ్, ప్రవీణ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంరెడ్డి, డైరెక్టర్ బాబు, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బొక్క వెంకట్‌రెడ్డి, భాస్కర్, విజయ్‌రాజ్, కరుణాకర్, రవీందర్‌రెడ్డి, అమీద్‌ఖాన్, అప్సర్, శ్రీశైలం, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేసేందుకు కృషి

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు

చేవెళ్ల: బీసీలకు న్యాయం చేయాలనే పట్టుదలతోనే కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్‌లను ప్రకటించి ఎన్నికలకు వెళ్లిందని కాంగ్రెస్ పార్టీ గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు అన్నారు. చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు అసెంబ్లీలో అన్ని పార్టీలు అంగీకరించి, ఇప్పుడు ఎన్నికలు జరగకుండా ప్రతిపక్ష పార్టీల నాయకులే తెరవెనక ఉంటూ కోర్టుకు వెళ్లి డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్‌లు ఇవ్వాలంటూనే మరో వైపు కోర్టులకు వెళ్లటం వెనక వీరికి బీసీలపై ఉన్న ప్రేమ ఏమిటో అర్థం అవుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పకుండా ఇచ్చిన మాట ప్రకారమే బీసీలకు 42శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహిస్తుందని నమ్మకం ఉందన్నారు. ఎన్ని అడంకులు వచ్చినా ఎదుర్కొనేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నద్ధంగానే ఉందని తెలిపారు. బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటే బీసీలంతా ఏకమైన వ్యతిరేకులపై తిరుబాటు చేస్తామని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్ల హామీ బూటకం

బీసీ నాయకుల మండిపాటు

చేవెళ్ల: బీసీ రిజర్వేషన్ల హామీ అంతా బూటకమని ఈ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని బీసీ సంఘం నాయకుడు రామగౌడ్ మండిపడ్డారు. గురువారం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించటంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ కేవలం ప్రజలను మోసం చేసేందుకేనని బీసీలపై ప్రేమతో కాదని తేలిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచుకునేందుకు బీసీ రాగం ఎత్తుకున్నారన్నారు. కనీసం బీసీలకు 42శాతం ఇస్తామని చెప్పిన రిజర్వేషన్ల కూడా రాజకీయం కోసం వాడుకుంటుందని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడిచినా కూడా ఎన్నికలు లేక పంచాయతీ పాలన కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు నిజంగా న్యాయం చేయాలంటే వెంటనే ఈ ఎన్నికలను 42శాతం రిజర్వేషన్లతో ప్రభుత్వం నిర్వహించి తీరాలన్నారు. రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీసీల సత్తాను చాటి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

శానిటేషన్ పనులు చేపట్టాలి

ఏఐసీసీ కోఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: వర్షాలతో కాలనీల్లో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణాన్ని వెంటనే కార్పొరేషన్ సిబ్బంది తొలగించాలని ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కోరారు. గురువారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ ఎస్‌ఆర్‌ఆర్ కాలనీలో ఆయన పర్యటించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇళ్ల ఎదుట వరదనీరు చేరి అంటు వ్యాధులకు నిలయంగా మారిన సంగతి గుర్తించాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, వైరల్ ఫీవర్, లాంటి రోగాలు సంభవించకుండా శానిటేషన్ పనులు చేయించేలా కమిషనర్ పి.సరస్వతితో మాట్లాడానని చెప్పారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాజు, మహేందర్, జగన్, సాయిబాబా, త్రిలోకనాథ్‌రెడ్డి, ప్రశాంత్, నవీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఆర్‌ఆర్ కాలనీలో పర్యటిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ముంపు సమస్యకు త్వరలో పరిష్కారం

ఎల్‌బీనగర్: వరద ముంపు కాలనీలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, ఇందుకు అనుగుణంగా అధికారులు వరద కాలువ నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వినూత్ననగర్, గాంధీనగర్, అఖిలాండేశ్వరకాలనీ, స్నేహమయనగర్, పీవీఆర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి వివిధ శాఖల అధికారులతో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు మౌళిక వసతులు కల్పనకు అధికారులు శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధంచేయాలని పేర్కొన్నారు. తరచూ ముంపునకు గురికావడం వలన కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి కష్టాలను తీర్చేందుకు వారికి అండగా ఉంటామని హామి ఇచ్చారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మధుసూదన్‌రెడ్డి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షాబాద్ పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న 69వ మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ జూనియర్, సీనియర్ లెవల్‌లో క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఏఎంఆర్ ట్రస్ట్ ఎంతో కృషి చేస్తోందన్నారు. క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో క్రీడాపాలసీ ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికితీసి, వారికి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో యువత ప్రతిభ కనబర్చాలని సూచించారు. ప్రతి పాఠశాలల్లో ఒక స్పోర్ట్ టీచర్ ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. క్రీడాపోటీల నిర్వహణతో గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడుతాయన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్ధన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, మునగపాటి నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, లింగం, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారావు, రాహుల్‌గుప్తా, శేఖర్, కృష్ణారెడ్డి, యాదయ్య, రఫీక్, మహేశ్, రమేశ్, సూర్యగౌడ్, రఘు, విజయ్, క్రీడాకారులు, తదితరులు ఉన్నారు.

ఎన్నికలకు నామినేషన్లు నిల్

చేవెళ్ల: స్థానిక ఎన్నికలకు సంబంధించి పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో మొదటిరోజు గురువారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు ఒక్కరూ కూడా నామినేషన్ వేయలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మహమ్మద్ రియాజ్, ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే పోలీసులు బారీకేడ్స్ పెట్టి ఎలాంటి వాహనాలను అనుమతించలేదు. కేవలం అభ్యర్థులు ఎవరైనా ఒక్కరే నామినేషన్ పత్రాలను తీసుకునేందుకు లోపలికి అనుమతించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలీసులు నామినేషన్ కేంద్రం వద్ద విధులు నిర్వహించారు.

మొయినాబాద్‌రూరల్: స్థానిక ఎన్నికలకు సంబంధించి మొదటిరోజు జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు ఒక్క నామినేషన్ కూడా వేయలేదని మండల అభివృద్ధి అధికారి సంధ్య తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మొదటిరోజు నామినేషన్‌ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానాలకు ఎలాంటి నామినేషన్‌లు రాలేదన్నారు.



నామినేషన్ కేంద్రానికి వెళ్లే దారిలో బారీకేడ్ల ఏర్పాటు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కృష్ణ



వనస్థలిపురం: వర్షాకాలం, వాతావరణ మార్పు, దోమల వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, మొదట్లోనే వ్యాధిని గుర్తిస్తే సరైన చికిత్స పొందవచ్చని వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, జనరల్ ఫిజీషియన్ డా.ఎన్.కృష్ణ అన్నారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

- వర్షాకాలంలో మలేరియా, డయేరియా, ఫీవర్, డెంగీ, చికన్ గున్యా తదితర రోగాలు వస్తుంటాయి. ఈ సీజనులో విషజ్వరాలు, డెంగీ, ఆర్ఎస్‌వీ (రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరస్) వ్యాధులు ప్రబలుతుంటాయి. డెంగీ కేసులు కూడా వస్తున్నాయి. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు, ఇన్‌పేషంట్లకు కావలసిన బెడ్లు అందుబాటులో ఉన్నాయి.
- వర్షాకాలానికి ముందు రోజుకు 600–700 ఓపీ కేసులు ఉండగా ప్రస్తుతం రోజుకు 1200 నుంచి 1500 మంది వస్తున్నారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, దగ్గు, జలుబు. లూజ్ మోషన్ లక్షణాలతో వస్తున్నారు. వారిలో కొందరికి డెంగీ పాజిటివ్ వస్తోంది.
- వర్షాకాలంలో నీటి గుంతలు, ఇళ్లల్లో ఉండే కుండీలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ బాటిళ్ల తదితర సామాగ్రిలో నిల్వ ఉండే నీటి వల్ల దోమలు వృద్ధి చెందుతాయి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. పగటి పూట కుట్టే దోమలవల్ల డెంగీ వస్తుంది. దోమలు కుట్టకుండా దోమతెరలు, చేతులు, కాళ్లు కప్పి వుంచేలా దుస్తులు ధరించాలి.
- సాధ్యమైనంత వరకు నిల్వ పదార్థాలు, బయటి ఫుడ్ తీసుకోవద్దు. కాచి చల్లార్చి వడకట్టిన నీటిని మాత్రమే తాగాలి. అనవసరంగా కంగారు పడకుండా తగినంత విశ్రాంతి తీసుకోవాలి. గాబరా పడి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృధా చేసుకోరాదు. మంచినీరు బాగా తాగి మూత్రం సాఫీగా వచ్చేలా చూసుకోవాలి.



వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో ఓపీ కౌంటర్ వద్ద బారులు తీరిన అవుట్ పేషెంట్లు